నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు.

◆ మాతృశ్రీనగర్, కల్యాణ్ గార్డెన్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాతృశ్రీ నగర్ కొంత భాగం, ఓల్డ్ సొసైటీ, ఎస్‌బీఐ, మాధవనగర్, అంబేద్కర్‌నగర్, నందినగర్, రాజారాం కాలనీ, సాయి రంగ థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో)... టమాట 15, పచ్చిమిర్చి 45, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 50, కీర 35, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 40, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 300

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చందానగర్: మియాపూర్ డివిజన్ పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.5.60 కోట్లతో వరద నీటి కాలువ, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టనున్నామన్నారు. శ్రీల గార్డెన్ కాలనీలోని వంశీ గెలాక్సీ అపార్ట్‌మెంట్ వరకు రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, జయప్రకాష్ నారాయణ నగర్ ప్లాటినం స్కూల్ మెయిన్ రోడ్డు వరకు రూ.42 లక్షలతో సీసీ రోడ్డు, గురునాథం చెరువు నుంచి పటేల్ చెరువు వరకు రూ.5 కోట్లతో నూతనంగా వరదనీటి కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలోని శ్రీ రామాలయంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం విశేష నవగ్రహారాధన, హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణ చార్యులు నేతృత్వంలో చేపట్టిన ప్రత్యేక పూజల్లో కాలనీ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



రాయదుర్గం: గౌలిదొడ్డిలో నూతనంగా నిర్మించిన సంజీవినీ ఆంజనేయసహిత వైకుంఠ సీతారామ నారాయణస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆదివారం అర్చకుల మంత్రోచ్ఛరణలు, భక్తుల జయజధ్వానాల మధ్య ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలో పునర్నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి కొల్లూరుకు చెందిన నర్సింలు రూ.85 వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆలయాల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు దాతను ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువత వెంకటేశం గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, మంద రమేష్, లింగం , బ్రహ్మేందర్, శ్రీకాంత్ గౌడ్, బ్రహ్మేందర్ గౌడ్, చంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్కిల్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఈ సందర్భంగా వెల్లడించారు.

క్రీడా మైదానాలు లేక అవస్థలు!

ముళ్లపాదల్లో ఆడుకుంటున్న యువకులు

- స్థలం కేటాయించాలని వినతి
- పట్టించుకోని ప్రభుత్వాలు



ఉస్మాన్‌నగర్‌లో ముళ్లపొదల మధ్య క్రికెట్ ఆడుతున్న యువకులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): మహానగరంగా విస్తరిస్తున్న తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్రాపురంలో క్రీడామైదానాలు యువత ఆటలకు దూరమవుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారు శ్మశానల్లో, ముళ్ల పొదల్లో ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనేక ఏళ్లుగా స్థానిక క్రీడాకారులు, యువత రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో క్రీడామైదానం కోసం భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. పాలకులు మారుతున్నా ప్రభుత్వం మాత్రం క్రీడామైదానం కోసం స్థలం కేటాయించడం లేదు.

ముళ్లపొదల్లో ఆటలు

మున్సిపల్ పరిధిలోని గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయి. కానీ క్రీడామైదానాలు లేకపోవడంతో స్థానిక యువకులు ముళ్లపొదల్లో ఆడుకుంటున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతాల్లో బహుళఅంతస్తుల భవనాలు నిర్మాణం జరుగుతుండడంతో వలస కార్మికులు ఎక్కువగా నివాసం ఉంటున్నారు. వారు కూడా శని, ఆదివారాల్లో రోడ్లపై, ముళ్లపొదల్లో క్రికెట్ ఆడుకుంటున్నారు.

స్థలం కేటాయించండి..

క్రీడామైదానం కోసం స్థలం కేటాయించాలని స్థానిక యువత ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. ఈ ప్రాంతాలకు చెందిన వందలాది ఎకరాల భూములను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్నాయి. నేడు ప్రభుత్వం క్రీడామైదానాలకు భూమిను కేటాయించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కొరుతున్నారు.

ప్రైవేట్ క్రీడామైదానాలకు డిమాండ్

క్రీడామైదానాలు లేకపోవడంతో చాలా మంది ఉద్యోగులు ప్రైవేట్ క్రీడామైదానాల్లో డబ్బులు చెల్లించి ఆడుకుంటున్నారు. దీంతో ఈ ప్రాంతంలో అనేక ప్రైవేట్ క్రీడామైదానాలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం క్రీడామైదానాలను అభివృద్ధి చేస్తే అన్ని వర్గాల ప్రజలు క్రీడల్లో రాణించే అవకాశం ఉంది.

క్రీడలకు దూరంగా ఉంటున్నాం



క్రికెట్ అంటే ప్రాణం గతంలో భెల్ పరిసరాల ఖాళీ స్థలాల్లో బాగా ఆడేవాళ్లం. యాజమాన్యం ఆడుకునే స్థలాల్లో మొక్కలు పెట్టడంతో క్రీడాలకు దూరంగా ఉంటున్నాం. బయట కూడా క్రీడామైదానాలు లేకపోవడంతో క్రీడలపై ఆసక్తి తగ్గింది.

– అల్తాఫ్, విద్యుత్‌నగర్ కాలనీ

మైదానాలను అభివృద్ధి చేయాలి



ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో క్రీడామైదానాలకు భూములను కేటాయించి.. అందులో అన్ని రకాల క్రీడామైదానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. లేనిపక్షంలో రానున్న రోజుల్లో యువత క్రీడలకు దూరమయ్యే అవకాశం ఉంది.

– శేఖర్, రామచంద్రాపురం

త్వరలో అన్ని సమస్యలకూ పరిష్కారం



ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీతో శిల్పావ్యాలీకాలనీ వాసులు

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

గచ్చిబౌలి: శిల్పావ్యాలీకాలనీలో త్వరలో పర్యటించి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని శిల్పావ్యాలీ కాలనీవాసులు ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు చేపడుతామన్నారు. ముఖ్యంగా మిగిలిపోయిన సీసీరోడ్లను వేసేందుకు, యూజీడీ పనులు, మంచినీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని, వీధిదీపాలనుఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు ధీరజ్, గౌతమ్, సుబ్బారెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

రాజేంద్రనగర్: హసన్‌నగర్ మహమూద్‌నగర్ మసీదు-ఏ-హలీమా సుల్తానాలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ అబ్దుల్ మోహసిన్ ఉమ్రీ కతీబ్, ఎంఐఎం నాయకులు మహ్మద్ జహంగీర్, ఇక్బాల్ ఖాన్, మహ్మద్ సిద్దిఖ్ అహ్మద్, మీర్జా రిజ్వాన్ బేగ్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్‌పై మహిళల నిరసన

ర్యాలీలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు వ్యతిరేక ఆందోళన కార్యక్రమాలు 12వ రోజుకు చేరుకున్నాయి. మండలంలోని గ్రామ గ్రామాల్లో సర్వత్రా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. నిరసన ర్యాలీలు, రిలే నిరాహార దీక్షల కార్యక్రమాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై మద్దతు తెలిపారు. డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాలని చూస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా గుమ్మడిదల నుంచి అన్నారం వరకు ఆందోళనకారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు రైతులు మహిళలు యువకులు, పాల్గొన్నారు.

అధ్వానం.. అంతర్గత రహదారులు

- గుంతల రోడ్లతో వాహనదారులకు తిప్పలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

మూసాపేట: మూసాపేట డివిజన్ పరిధిలోని అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయి. అభివృద్ధి పేరిట తవ్విన అధికారులు మళ్లీ మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు, స్థానికులకు ఇబ్బందిగా మారింది. ఇళ్ల ముందు చిన్నారులు ఆడుకునే సమయంలో కూడా కిందపడి గాయాల పాలవుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. జనతానగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డంగా గోతులు ఉన్నాయి. గత రెండు సంవత్సరాలుగా గోతులు ఇలాగే ఉన్నా అధికారులు పట్టించుకోవటం లేదు. మరమ్మతులు చేయాలని, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని విన్నవించినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. జనతానగర్‌లోని వడ్డెర బస్తీలో, యాదవ బస్తీలోని పలు చోట్ల అభివృద్ధి పేరిట తవ్వి మళ్లీ మరమ్మతులు చేయటం మరిచారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మరమ్మతులను చేయాలని కోరుతున్నారు.



జనతానగర్‌లో..



ప్రభుత్వ బాలుర పాఠశాల ముందు ప్రధాన రహదారి దుస్థితి

గణేషుడికి బెల్లంతో ప్రత్యేక అలంకారం



రాయదుర్గం: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివ సాయి క్షేత్రంలో ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వినాయకుడికి ప్రత్యేక అర్చన, అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారిని బెల్లంతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆతర్వాత అన్నపూర్ణాదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా, ఆంజనేయస్వామి, సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అష్టోత్తరపూజలను నిర్వహించారు.

28వ తేదీ వరకు మలివిడత కులగణన సర్వే

రాయదుర్గం: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే రెండవ విడత కార్యక్రమం ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుందని రాష్ట బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్ తెలిపారు. గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓకాలనీలో ఆయన కాలనీవాసులతో కలిసి ఆదివారం పర్యటించి కులగణనలో మొదటి విడతలో పాల్గొనని వారిని ఈ సారి పాల్గొని వివరాలు అందించాలని సూచించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో మిగిలిపోయిన వారిని ఈసారి నిర్వహించే కులగణనలోపాల్గొని తమ పూర్తి వివరాలు అందించాలని ఆయన సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులను పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ నేత జగదీశ్వర్ గౌడ్

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలినగర్‌లో వద్ద నిర్మిస్తున్న నాలా విస్తరణ పనులను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ స్థానిక కాలనీ, నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన దృష్టికి వచ్చే ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, బాంగారు బాబు, ప్రసాద్‌రెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి, కృష్ణ కుమార్, మూర్తి, కన్నారావు, హరి ప్రసాద్, కిషోర్, వినయ్, కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి మండల పూజల్లో భాగంగా సోమవారం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో శివస్వాములు, భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఏఐసీసీ కిసాన్ వింగ్ కో ఆర్డినేటర్ రాహుల్ సింగ్ సిద్ధు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న అభిషేక్ గౌడ్

శేరిలింగంపల్లి: దేశాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని ఏఐసీసీ కిసాన్ వింగ్ కో ఆర్డినేటర్ రాహుల్ సింగ్ సిద్ధు తెలిపారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్ గౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శిబాబు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ సింగ్ సిద్ధు మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారులు సునీల్ పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేశాం



మాజీ ప్రజాప్రతినిధులు సన్మానిస్తున్న హుడాకాలనీ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీని ఐదేళ్లలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అభివృద్ధి చేశారని అన్నారు. ఆదివారం 4వ వార్డు హుడాకాలనీ సంక్షేమ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ వందన నగేష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జె.సిద్ధప్పతో పాటు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో నిధులు లభ్యతను బట్టి పార్కులు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, కమ్యూనిటీహాల్ తదితర అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లోనూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, నాయకులు సి.బీరప్ప, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భోజనం నాణ్యతగా ఉండాలి

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



విద్యార్థులతో టీఎస్ఎస్ఓ అధ్యక్షుడు లక్ష్మీనివాస్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌ను ఆదివారం టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లక్ష్మీనివాస్‌కు పలు సమస్యలను వివరించారు. తమకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని.. నెలల తరబడి అధికారులకు సూచించిన పట్టించుకోవడం లేదని హాస్టల్ విద్యార్థులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురవుతున్నారని.. విద్యార్థులకు తమకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని వివరించారన్నారు. హాస్టల్ భోజనం నాణ్యతగా ఉండే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్ అధికారులపై విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఉన్న హస్టళ్లపైన తనిఖీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు రఘు ముదిరాజ్, సుధాకర్, సంపత్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తామెప్పుడు సిద్ధంగా ఉంటామని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బీవీకే మూర్తి అన్నారు. ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులు, కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల నాయకుల కోసం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారు 99592 26133 నంబర్‌లో తనను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను పరిశీలించి దానికి అనుగుణంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాణా ప్రతాప్‌నగర్‌లో వసతులు కల్పిస్తాం

కార్పొరేటర్ సబిహా బేగం



సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాణా ప్రతాప్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని కార్పొరేటర్ సబిహా బేగం సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా మాధవాచారి, ప్రధాన కార్యదర్శిగా సాంబయ్య, కోశాధికారిగా శ్యామ్ సుందర్ రెడ్డి, చైర్మన్‌లుగా రవీందర్ గౌడ్, లింగం, వైస్ ప్రెసిడెంట్‌గా రాజయ్య చారి, బాబా, శంకర్, గఫూర్, జాయింట్ సెక్రటరీలుగా ఆకుల అనిల్ కుమార్, జహంగీర్ బాబా, నిజాం, ఉమర్, కిష్టారెడ్డి ఎన్నికయ్యారు. రాణా ప్రతాప్ నగర్‌లో నూతన బోర్ వాటర్ కోసం మోటార్ బిగించామని కార్పొరేటర్ తెలిపారు. మిగిలిన పెండింగ్ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, మల్లికార్జున్, రాంరెడ్డి, యోగి, పార్వతమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వెలగని లైట్లు.. కమ్ముకున్న చీకట్లు!

- ధరణినగర్‌లో నెల రోజులుగా వెలగని వీధి దీపాలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ధరణినగర్‌లోని వివిధ వీధుల్లో వీధి లైట్లు వెలగడం లేదు. కాలనీలో వీధి దీపాలు సుమారు నెల రోజుల నుంచి వెలగకపోవడంతో కాలనీలోని అంతర్గత రహదారులు చీకటిమయంగా ఉంటున్నాయి. దొంగల బెడద, కుక్కల బెడద, పోకిరీల బెడదతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ధరణినగర్‌కు ఆనుకుని పరికి చెరువు నాలా ప్రవహిస్తూ ఉంటుంది. నాలాలో విషపురుగులు, సర్పాలు సంచరిస్తుంటాయి. కొద్ది రోజుల క్రితమే ఆల్విన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో కొండ చిలువ వంటి భారీ పాములు కనిపించిన సంఘటనలు ఉన్నాయి. పాములను పట్టుకునే వారిని పిలిపించారు. స్థానికంగా కూడా దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇదే ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు, పాలప్యాకెట్లు, నూతనంగా నిర్మించే ఇళ్లల్లో చొరబడి ఎలక్ట్రికల్, కలర్స్ డబ్బాలు, ఇతర విలువైన సామాగ్రిని అపహరించిన ఘటనలు కూడా ఉన్నాయి. వీధి దీపాలు వెలగక పోవటంతో సీసీ కెమెరాల్లో కూడా ఏమీ కనిపించకపోవటంతో అటు వైపు వచ్చిన వారిని కూడా గుర్తించటం కష్టంగా ఉంటుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. కాలనీలోని శ్రీకనకదుర్గమ్మ దేవాలయం ప్రాంగణం, హైటెన్షన్ రోడ్డు, కాలనీ ప్రధాన రహదారులు, వీధుల్లో లైట్లు కూడా వెలగక పోవటంతో కాలనీ వీధులన్నీ రాత్రి చీకటిగా మారుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్కిల్ సెంటర్స్ ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్స్ ఏర్పాటు కోసం నిరుద్యోగ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ, జిల్లా, మండ స్థాయిలో సెంటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్కిల్ సెంటర్స్ ద్వారా వెబ్ డిజైనింగ్, సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, బ్లాక్ చెయిన్, తదితర 100కు పైగా కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని పేర్కొన్నారు. కోర్సులకు సంబంధించి ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.